నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 14-8-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 11 పేజీలు: 4 వెల: రూ.1/-

కాళేశ్వరంలో కీలక ఘట్టం.. మల్లన్న సాగర్‌ను ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్ , ఆగష్టు 13:రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో అంతే కీలకమైన మల్లన్న సాగర్ రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. ఏడున్నర వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తవడానికి మూడేళ్లు పట్టింది. ఈ నెల 18న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి నీటిని రిజర్వాయర్లోకి విడుదల చేసే అవకాశముంది.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మేడిగడ్డ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, అనంతగిరి, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల ద్వారా కొమరెల్లి మల్లన్నసాగర్‌కు నీటిని ఎత్తిపోస్తారు. ప్రధాన నదులపై కాకుండా నీటిని మళ్లించి నిల్వ చేసుకొనే రిజర్వాయర్లలో రాష్ట్రంలో ఇదే పెద్దది. ఇది అత్యధిక ఆయకట్టుకు నీరందించనుంది. అంతేకాకుండా కొండపోచమ్మ, బస్వాపూర్ రిజర్వాయర్ల కింద, సింగూరు కాలువలకు, తపాసుపల్లి రిజర్వాయర్ కింద, దుబ్బాక నియోజకవర్గానికి నీటిని ఇచ్చేది మల్లన్నసాగర్ నుంచే. ఈ భారీ రిజర్వాయర్ నిర్మాణం మూడేళ్లలోనే పూర్తి కావొచ్చింది.

ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించడం, ఇంజినీర్లు గుత్తేదారులతో పనులు పరుగులు పెట్టించడానికి గట్టి ప్రయత్నం చేయడం ఇందుకు దోహదం చేశాయి.

ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 7,500 కోట్లు ఖర్చు చేయగా.. పదిహేడు వేల ఎకరాల భూమిని సమీకరించారు. మొత్తం 50 టీఎంసీల సామర్థ్యంతో దీనిని చేపట్టారు. ఈ ఏడాది పది టీఎంసీలు నిల్వ చేయనున్నారు. ఈ రిజర్వాయర్‌కు నాలుగు వైపులా తూములున్నాయి. కొండపోచమ్మ, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని మళ్లించి ఆయకట్టుకు సరఫరా చేసేందుకు, రోజుకు ఒక టీఎంసీ నీటి విడుదలకు నాలుగు గేట్లతో ఒక స్లూయిస్ నిర్మించారు. దీనికింద ఎత్తిపోతల పనులన్నీ గతంలోనే పూర్తయ్యాయి. సింగూరు కాలువకు రోజుకు 0.6 టీఎంసీ సామర్థ్యంతో నీటిని వదలడానికి ఒక స్లూయిస్ ఏర్పాటు చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో లక్షా 25వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఒకటి, తపాసుపల్లి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు మరొకటి నిర్మించారు.

తెలంగాణలో రానున్న మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్ , ఆగష్టు 13: తెలంగాణలో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ఇవాళ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని అంచనా వేసింది. రేపు, ఎల్లుండి ఒకట్రెండు చోట్ల మోస్తరు వాన కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణ శాఖ వివరించింది.

వాహనాల తుక్కు పాలసీని ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 13:వాలంటరీ వెహికిల్ ఫ్లీట్ మోడెర్నైజేషన్ ప్రోగ్రామ్ లేదా వాహనాల తుక్కు పాలసీ(బఇఠీజీజూజూజీణవ జూనీశ్రీతిఇ ఎ)ని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. గుజరాత్‌లో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్న మోదీ.. ఈ కొత్త విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ తుక్కు పాలసీ రూ.10 వేల కోట్ల పెట్టుబడులను తీసుకురానున్నట్లు ఈ సందర్భంగా మోదీ చెప్పారు. గుజరాత్‌లోని అలంగ్ ఈ వాహనాల

తుక్కుకు హబ్‌గా మారగలదని అన్నారు.

ప్రస్తుతం ఉన్న తుక్కు పద్ధతి అంత ప్రయోజనకరంగా లేదని మోదీ చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఈ తుక్కు పాలసీ కారణంగా ముడి సరుకుల ధరలు 40 శాతం వరకూ తగ్గుతాయని గడ్కరీ అన్నారు. ఆటోమొబైల్ తయారీలో ఇండియా ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందని ఆయన చెప్పారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో దేశంలోని అన్ని జిల్లాల్లో టెస్టింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు గడ్కరీ వెల్లడించారు.

పాత, కాలుష్యానికి కారణమవుతున్న తమ వాహనాలను తుక్కు కింద మార్చడానికి ముందుకు వచ్చే యజమానులకు ఈ కొత్త విధానం కారణంగా లబ్ధి కలగనుంది. ఈ విధానంలో భాగంగా 15 ఏళ్లు పైబడిన వాణిజ్య వాహనాలు, 20 ఏళ్లు పైబడిన వ్యక్తిగత వాహనాలను తుక్కు చేయాల్సి ఉంటుంది. మొదట ఈ విధానాన్ని ప్రభుత్వ వాహనాలకు అమలు చేయనుండగా.. ఆ తర్వాత భారీ వాణిజ్య వాహనాలు, వ్యక్తిగత వాహనాలకు అమలు చేస్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దగ్గర ఉన్న 15 ఏళ్లు పైబడిన వాహనాలను తుక్కుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యక్తిగత వాహనాలను 2024 జూన్ నుంచి తుక్కు కింద మలచనున్నారు.

2డీజీతో కోవిడ్ రోగుల్లో బోలెడంత ఆక్సిజన్: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 13:2డీజీ (2ఆఉ)ఔషధం చాలా ప్రభావంతంగా పనిచేస్తున్నదని డాక్టర్లు తనకు తెలిపారని, ఆ ఔషధాన్ని వాడడం వల్ల కరోనా రోగుల్లో ఆక్సిజన్ స్థాయి అమాంతంగా పెరుగుతందని ఇవాళ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇలాంటి ఔషధాన్ని మరే దేశం కూడా తయారు చేయలేదని మంత్రి చెప్పారు. కానీ భారతీయ శాస్త్రవేత్తలు ఆ అద్భుతాన్ని సాధించినట్లు ఆయన వెల్లడించారు. మన దేశానికి చెందిన సైనిక దళాలు, శాస్త్రవేత్తలు ఎన్నడూ దేశాన్ని నిరుత్సాహపరచలేదని ఆయన అన్నారు. కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉన్న సమయంలో.. డీఆర్‌డీవో నేతృత్వంలో తయారు చేసిన 2డీజీ ఔషధాన్ని మార్కెట్లోకి రిలీజ్ చేసిన విషయం తెలిసింది.

ఇవాళ ఢిల్లీలోని డీఆర్‌డీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి రాజ్‌నాథ్ మాట్లాడారు. టోక్యో ఒలింపిక్స్ జరుగుతున్న సమయంలో.. భారత్‌కు గోల్డ్ మెడల్ వస్తుందో రాదో అన్న టెన్షన్ ఉండేదని, కానీ సుబేదార్ నీరజ్ చోప్రా అద్భుతం సాధించాడని, జావెలిన్ త్రో ఈవెంట్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు.

ప్రధాని మోదీ సీఎం నితీశ్‌ను అవమానించారు: తేజశ్వి యాదవ్

పాట్నా, ఆగష్టు 13:: బీహార్ సీఎం నితీశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ అవమానించారని ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్ ఆరోపించారు. కేంద్రంలో, బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కులాల ఆధారంగా జనాభా గణనపై ప్రధాని మోదీతో చర్చించాలని సీఎం నితీశ్‌ను కలిసి తాము కోరినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న సీఎం నితీశ్ కుమార్, ప్రధాని మోదీకి లేఖ రాశారని, అయితే పీఎంవో కార్యాలయం నుంచి ఇంత వరకు ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఇది సీఎం నితీశ్‌ను మోదీ అవమానించడమేనని ఆరోపించారు. ఇంత ముఖ్యమైన అంశాన్ని ఆయన విస్మరిస్తున్నారని మండిపడ్డారు.

ఈ నేపథ్యంలో బీహార్ అసెంబ్లీ నేతలు ఈ అంశంపై కలిసి చర్చించేందుకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోరుతూ తేజశ్వి యాదవ్ శుక్రవారం లేఖ రాశారు. తన లేఖపై మోదీ స్పందించకపోతే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తాము ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.

రక్త దానం కంటే మెరుగైన సేవ ఏదీ లేదు: ఎయిమ్స్ డైరెక్టర్ గులేరియా

న్యూఢిల్లీ, ఆగష్టు 13:రక్త దానం కంటే మెరుగైన సేవ ఏదీ లేదని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా అన్నారు. దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆజాది కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ఢిల్లీలో అఐఈ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. 'భారతదేశం 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకోవడానికి రక్తదానం కంటే మెరుగైన సేవ ఏదీ లేదు. ఇప్పటివరకు దాదాపు 1500 మంది రక్త దానం చేశారు' అని గులేరియా అన్నారు. ఈ రక్త దాన శిబిరం ఆగస్ట్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. రక్త దానం కోసం మరింత మంది ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

దేశంలో కరోనా థర్డ్ వేవ్‌ను నివారించడానికి ప్రజలు కోవిడ్ నిబంధనలను పాటించాలని రణదీప్ గులేరియా సూచించారు. కరోనా టీకాలు తీసుకోవడం, మాస్క్‌లు ధరించడం ఎంతో ముఖ్యమన్నారు

దళితబంధుపై ఎందుకీ కుట్రలు.. వాళ్ల కడుపు కొడుతారా?

జమ్మికుంట, ఆగష్టు 13: : బీజేపీ దళిత వ్యతిరేక పార్టీ అని, అలాంటి దుర్మార్గమైన పార్టీకి ఇక్కడ స్థానం లేదని మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. దళితులు ఆర్థికంగా నిలదొక్కునేందుకే దళిత బంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్నారని తెలిపారు. అలాంటి పథకంపై బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ.. దళితుల కడుపు కొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 11, 27వ వార్డుల్లో పర్యటించిన మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దళిత బంధు పథకంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. దళిత బంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ఈ నెల 16వ తేదీన లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం 20 నుంచి 25 రోజుల్లో 20 వేల మంది దళితుల ఖాతాల్లో రూ. 10 లక్షల చొప్పున జమ చేస్తామన్నారు. ఈ పథకంతో నగదు ఖాతాల్లో జమ కాగానే.. బీజేపీ నాయకుల ముఖాలపై తన్నినట్లు అవుతుందన్నారు. దళిత బంధును ఆపేందుకు కుట్రలతో పాటు రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం సరికాదన్నారు.

బీజేపీతో పాటు ఇతర పార్టీల కుట్రలను విచ్ఛిన్నం చేయాలని, పనిచేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలని మంత్రి కొప్పుల విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుల వితంతు కూతుళ్లకు పెన్షన్ ఇవ్వాల్సిందే: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగష్టు 13:స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన వితంతు కూతుళ్లకు కూడా డిపెండెంట్ పెన్షన్ ఇవ్వాలని ఇవాళ ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్రానికి కోర్టు ఆదేశాలు కూడా జారీ చేసింది. ఒకవేళ ఆ కేసులో మిగితా అన్ని షరతులు వర్తిస్తే, అప్పుడు 8 వారాల్లోగా ఆ వితంతువుకు పెన్షన్ ఇవ్వాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. స్వాతంత్ర్య సమరయోధులకు చెందిన కూతుళ్లు విడాకులు తీసుకున్నా.. లేక వాళ్ల భర్తలు చనిపోయినా.. అలాంటి వారికి ఫ్రీడం ఫైటర్ పెన్షన్ ఇచ్చేది లేదని గతంలో కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొన్నది. స్వతంత్రతా సైనిక్ సమ్మాన్ పెన్షన్ స్కీమ్‌కు అలాంటి వాళ్లు అర్హులు కాదని కేంద్రం ఓ లేఖలో తెలిపింది. చనిపోయిన ఓ స్వాతంత్ర్య సమరయోధుడి కూతురు ఇటీవల ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సైనిక్ సమ్మాన్ పెన్షన్‌ను తనకు ఇప్పించాలని కోరింది. అయితే ఆ మహిళ తన భర్తను కోల్పోయింది. అంతే కాదు, ఆమె మానసికంగా, శారీరకంగా దివ్యాంగురాలు.

ఆ పిటిషన్‌ను ఇవాళ జస్టిస్ వీ కామేశ్వర రావు విచారించారు. సైనిక్ పెన్షన్‌ను ఫ్రీడం ఫైటర్ల వితంతు కూతుళ్లకు ఇవ్వరని గత ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన కేంద్ర హోంశాఖ ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ కామేశ్వర రావు తోసిపుచ్చారు. పెన్షన్ స్కీమ్ లబ్ధి విడాకులు తీసుకున్న కూతుళ్లకు కూడా ఇవ్వవచ్చు అని గతంలో పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పులను ఢిల్లీ హైకోర్టు స్వాగతించింది. వితంతు మహిళ తన తండ్రి నవంబర్ 1, 2019లో చనిపో యినట్లు తన పిటిషన్‌లో తెలిపింది. అయితే ఆమె పూర్తిగా తన తండ్రిపై ఆధారపడేది. అందుకే ఫ్రీడం ఫైటర్ పెన్షన్‌ను తనకు బదిలీ చేయాలని ఆమె కోరింది.

దేశంలో విద్యాసంస్థలు అత్యవసర పరిస్థితి..!

న్యూఢిల్లీ, ఆగష్టు 13: కరోనా మహమ్మారి విస్తరించడంతో గత ఏడాది మార్చి నుంచి దేశంలో విద్యాసంస్థలు మూడతపడ్డాయి. ఇది పాఠశాలలు, కాలేజీల్లో డ్రాపౌట్స్ బాగా పెరిగిపోవడానికి దారితీసింది. అదేవిధంగా విద్యార్థుల్లో అభ్యసన స్థాయిలు కూడా భారీగా పతనమవడానికి కారణమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించాలా..? వద్దా..? అనే మీమాంసలో రాష్ట్రాలు ఉండగా.. తాజాగా ఓ అధ్యయనం మాత్రం అత్యవసరంగా పాఠశాలలను పునఃప్రారంభించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది.

ఇటీవల ఆజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ పాఠశాలలు మూతపడటంవల్ల విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై ఒక సర్వే చేసింది. మొత్తం దేశవ్యాప్తంగా వివిధ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 16 వేల మంది విద్యార్థులపై ఈ సర్వే నిర్వహించింది. విద్యార్థుల్లో దాదాపు అందరూ లాంగ్వేజ్ స్కిల్స్, మ్యాథ్స్ స్కిల్స్ మర్చిపోయారని సర్వేలో తేలింది. చిన్నారుల్లో దాదాపు 92 శాతం మంది విద్యార్థులకు కనీసం ఒక్క



లాంగ్వేజ్‌పై పట్టులేదని బయటపడింది. అదేవిధంగా 82 శాతం మంది చిన్నారులు మ్యాథ్స్ స్కిల్స్ మర్చిపోయారని నిర్ధారణ అయ్యింది.

ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈవో అనురాగ్ బెహర్ సర్వే వివరాలను వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలలను అత్యవసరంగా తెరువాల్సిన అవసరం ఉన్నదని, అయితే కరోనా వైరస్ నేపథ్యంలో ఒక ప్రణాళికతో ఆ పని చేయాలని బెహర్ అభిప్రాయపడ్డారు. కరోనా కారణంగా దేశంలో నిరుపేదలకు ఆర్థిక సమస్యలు రెట్టింపు అయ్యాయని, దాంతో పిల్లలను చదువు మాన్పించి పనుల్లో పెడుతున్నారని ఆయన చెప్పారు.

పరిస్థితి ఇలాగే కొనసాగితే డ్రాపౌట్స్ మరింత పెరిగిపోయే ప్రమాదం ఉన్నదని ఆయన హెచ్చరించారు. పిల్లలు చదువు మర్చిపోతారని, తర్వాత ఉన్న తరగతుల్లో పాఠాలు అర్థం చేసుకోవడం కష్టమవుతుందని చెప్పారు. అందుకే సరైన ప్రణాళికతో సాధ్యమైనంత త్వరగా పాఠశాలలను పునఃప్రారంభించడమే ఉత్తమమని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు.

తమిళనాడులో పెట్రోల్ ధర లీటరుకు రూ.3 తగ్గింపు

చెన్నై, ఆగష్టు 13: తమిళనాడులో పెట్రోల్ ధర లీటరుకు రూ.3 మేర తగ్గించారు. డీఎంకే ప్రభుత్వం ఈ మేరకు ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించింది. సీఎం స్టాలిన్ సర్కార్ తొలి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 'తమిళనాడులో 2.6 కోట్ల మంది ప్రజలు ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తున్నారు. వారిపై భారంపడకుండా పెట్రోల్ ధరలో రూ.3 తగ్గించాం. దీని కారణంగా రూ.1,160 కోట్ల లోటును ఎదుర్కొంటాం' అని చెప్పారు. వాతావరణ మార్పు రంగంపై బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మహిళా సభ్యులకు నెలవారీగా రూ.1,000 ఇస్తామన్న స్టాలిన్ ఎన్నికల వాగ్దానం కూడా ఈ బడ్జెట్‌లో పరిగణనలోకి తీసుకున్నారు.

తమిళనాడులోని ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవు కాలం 9 నెలల నుంచి 12 నెలలకు పొడిగించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి రూ.703 కోట్లు సబ్సిడీగా మంజూరు చేశారు. ఈ ఆర్థిక ఏడాది నుంచి సీఎం బీమా పథకాన్ని రూ.1,046 కోట్ల వ్యయంతో అమలు చేయనున్నారు. గ్రామీణ గృహ నిర్మాణానికి రూ.3,800 కోట్లు, ఎంజీఆర్ మధ్యాహ్న భోజన పథకానికి రూ.1,725 కోట్లు కేటాయించారు. చెన్నైని పోస్టర్ రహిత నగరంగా చేస్తామని, మూడు కొత్త ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చెన్నై మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ 2025 నాటికి పూర్తవుతుందని వెల్లడించింది.

కాగా, తమిళనాడు చరిత్రలో తొలిసారి స్టాలిన్ ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను కాగిత రహితంగా ప్రవేశపెట్టింది. దీని కోసం సభ్యులందరి టేబుల్స్ వద్ద కంప్యూటర్లు ఏర్పాటు చేసింది.

కొనసాగుతోన్న జల జగడం..

హైదరాబాద్ , ఆగష్టు 13:తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదం ఇప్పట్లో సద్దుమణిగేలా లేదు. ప్రాజెక్టుల పనుల పరిశీలన సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలపై తెలంగాణ ఇరిగేషన్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 11న రాయలసీమ ఎత్తిపోతల పరిశీలన సమయంలో కృష్ణా బోర్డు బృందంతో పాటు ఏపీ ఈఎన్సీ, సీఈలు ఉన్నారని, బృంద సభ్యులతో మాట్లాడటంతో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారని తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్ కేఆర్ఎంబి చైర్మన్ కు రాసిన లేఖలో స్పష్టం చేశారు. తెలంగాణ ఫిర్యాదు ఆధారంగా ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాల తర్వాత చాలా ఆలస్యంగా కేఆర్ఎంబీ బృం దం రాయ లసీమ ఎత్తిపోతల పనులను పరిశీ లించిం దని. తాము ఫిర్యాదు దారులమైన ందున తమ ప్రతినిధులను కూడా బృందం వెంట తీసుకెళ్లాలని బోర్డు ఛైర్మన్‌ను కోరామన్న రజత్ కుమార్. తటస్థులు మాత్రమే వెళ్లాలన్న కేంద్ర ఆదేశాలకు అనుగుణంగా ఛైర్మన్ ఆ ప్రతిపాదనను అంగీకరించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో కేఆర్ఎంబీ ఇచ్చే నివేదిక నిష్పాక్షికతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలంగాణ లేఖలో వెల్లడించారు. ఏపీ అధికా రుల చర్యలు కృష్ణా బోర్డు బృందాన్ని ప్రభా వితం చేసేలా ఉన్నాయని? లేఖ ప్రతులను కేంద్ర జల శక్తి శాఖ మంత్రి కార్యాలయం, కార్యదర్శికి కూడా రజత్ కుమార్ పంపినట్లు తెలిపారు.

చరిత్రలో నేటినిజం



దేశభక్తితో స్వాతంత్ర్య దిన వజ్రోత్సవాలు జరుపుకుందాం

(దేశభక్తిపై 'యుగౌవ్ సంస్థ' నిర్వహించిన అంతర్జాతీయ సర్వే ఆధారంగా)

భారతీయ సమాజం 75వ స్వాతంత్ర్య దినోత్సవాలను, వజ్రోత్సవాలుగా, అమృతోత్సవాలుగా ఘనంగా నిర్వహించుకుంటున్న శుభసందర్భమిది. ఈ శుభఘడియలో మన మనసుల్లో దేశభక్తిని నింపుకుంటూ, దేశాభివృద్ధికి మరోసారి పునరంకితం కావలసిన సమయమిది. దేశం పట్ల భక్తి భావన, బలమైన బేషరతు మద్దత్తు, దేశాన్ని చూసి గర్వం పడడం, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం వహించడం, దేశహిత కార్యాలకు ఉపక్రమించడం లాంటి లక్షణాల ఉన్న పౌరులను దేశభక్తులుగా గుర్తిస్తాం. మన దేశ చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మక, సామాజిక అంశాల పట్ల సదాభిప్రాయంతో ఉండడం ఉత్తమ పౌరుల లక్షణం. మహోన్నత దేశభక్తి, జాతీయవాదం ఒకదానికొకట మరొకటి ముడిపడి ఉండవచ్చు. దేశం కోసం శ్రమించడం, స్వయంగా ఎదుగుతూ జాతీయాభివృద్ధిలో పాలుపంచుకోవడం మన కనీస భాద్యత కావాలి. ఇలాంటి 'మనం ఎదుగుదాం, దేశాభివృద్ధికి తోడ్పడుదాం (ఆప్ బడో, దేశ్ కో బడావో)' అనే నినాదమే మన నరనరాల్లో ప్రవహించాలి. ఎవరికి నిర్ధేషించిన న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన విధులను వారు తూచా తప్పక నిర్వహించడం, ఎల్లవేళల మానవీయతను ప్రదర్శించడం మరువరాదు. ప్రపంచ స్థాయిలో దేశ గుర్తింపు ఆ దేశ పౌరుల మానసిక స్థితుల మీదనే ఆధారపడి ఉంటాయి. దేశభక్తుల్లో వసుధైక కుటుంబ భావన కూడా బలంగా చిరురిస్తుంది. జాతీయతాభావం కలిగిన వారిలో తమ దేశమే గొప్పదనే భావన ఉంటుంది. దేశభక్తుల్లో తమ దేశం పట్ల అవ్యాజమైన ప్రేమ వ్యక్తం అవుతూ, ఇతర దేశాలపై సదాభిప్రాయం ఉంటుంది. జాతీయ భావం కన్న దేశభక్తి ఉత్తమమైనదని తెలుస్తున్నది. దేశం ప్రజల్లో భద్రత, సంపదల అసమానతలు పెరిగితే అలజడులకు ఆజ్యం పోసినట్లు అవుతుంది. భిన్నత్వం ఏకత్వానికి ఊతం ఇవ్వాలి. భిన్నత్వం ముదిరితే విభేదాలు జనించవచ్చు. మనలోని కులమత భావనలు మన ప్రశాంత జీవన విధానానికి కందెనలుగా పని చేయాలి. స్వార్థపరులు పెరిగితే జాతీయతాభావం తరుగుతుంది. విద్యార్థి దశ నుంచి చిన్నారుల్లో పాఠ్యాంశాల ద్వారా దేశభక్తి బోధనలు నూరి పోయాలి. ఏ పని చేసిన 'నేషన్ ఫస్ట్' అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

'యుగౌవ్' సంస్థ ప్రపంచంలోని 19 దేశాల్లో దేశభక్తిపై అంతర్జాతీయ సర్వే నిర్వహించారు. ప్రపంచ ప్రజల దృష్టిలో అత్యుత్తమ దేశభక్తిగల దేశాల వివరాలు సేకరించే ప్రయత్నాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా తమ తమ దేశాల పట్ల నెలకొన్న ప్రజాభిప్రాయాలు ప్రకారం 10 అత్యుత్తమ దేశభక్తిగల దేశాల జాబితాను రూపొందించారు. యుగౌవ్ సర్వే చేసి సేకరించిన సమాచారం ప్రకారం తమ దేశం పట్ల సగర్వంగా ఉంటూ, దేశ ఉన్నతిని కాంక్షిస్తూ, తమ దేశమే ఉత్తమమైందని, దేశాభిమానాన్ని ప్రదర్శించిన ప్రజల వివరాల ప్రకారం అత్యుత్తమ దేశభక్తిగల దేశాల జాబితా విడుదల చేశారు.

1. అమెరికా (41 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
2. ఇండియా (35 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
3. ఆస్ట్రేలియా (34 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
4. యుఏఈ (27 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
5. సౌథీ అరేబియా (25 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
6. థాయ్‌లాండ్ (25 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
7. ఫిలిప్పీన్స్ (15 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
8. ఇండోనేషియా (14 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
9. యుకె (13 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)
10. డెన్మార్క్ (13 శాతం దేశభక్తిని ప్రదర్శించారు)

'ఫాల్ 2020 గ్లోబల్ అటిట్యూడ్స్ సర్వే' వివరాల ప్రకారం జర్మనీలో 53 శాతం, ఫ్రాన్స్‌లో 45 శాతం, యూకెలో 41 శాతం, యుయస్‌లో 39 శాతం ప్రజలు తమ దేశం పట్ల ప్రేమను ప్రదర్శించారు. అదే క్రమంలో జర్మనీలో 5 శాతం, ఫ్రాన్స్‌లో 6 శాతం, యూకెలో 10 శాతం, యుయస్‌లో 10 శాతం ప్రజలు తమ దేశం పట్ల దురభిప్రాయంతో ఆ దేశ ప్రజలుగా సిగ్గుపడుతున్నామని తేల్చారు. దేశభక్తిలో చివరన ఉన్న దేశంగా ఈస్ట్ జర్మనీ ఉందని తెలుస్తున్నది.

బ్రిటీష్ ఆర్మీ ఆఫీసర్ ఫీల్డ్ మార్షల్ ఫిలిప్ చెట్వోడ్ నినాదం నేటికీ అన్ని దేశాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నది. చెట్వోడే నినాదం ప్రకారం 'దేశ గౌరవం, భద్రత, సౌభాగ్యాలకు ఎల్లవేళల ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలి. మనపై ఆధారపడిన ప్రజల గౌరవం, భద్రత, సౌభాగ్యాలు ద్వితీయ స్థానంలో ఉండాలి. మన స్వీయ గౌరవం, భద్రత, సౌభాగ్యాలు ఎల్లవేళల చివరి స్థానంలో ఉండాలి' అనే వాక్యాలు మనకు నిత్య ప్రేరణ కావాలి. ఎవరి భాద్యతలను వారు సక్రమంగా నిర్వహిస్తూ, మానవీయ పువ్వుల సుగంధాలను వ్యాపింపజేస్తూ, చేతనైనంత వరకు దేశహిత సేవలకు చేయూతనిస్తూ, పరమ దేశభక్తులుగా భరతమాత దీవెనలు పొందుదాం. మన జాతీయ సంకేతాలైన జాతీయ గీతం, జాతీయ పాట, జాతి త్రివర్ణ పతాక రెపరెపలను వేద మంత్రాలుగా జపిద్దాం. దేశమంటే మామూలు మనుషులు కారని, పరమ దేశభక్తుల పవిత్ర కోవెలని నిరూపిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పిల్లలలో న్యూమోనియా వ్యాధి నిరోధానికి వ్యాక్సిన్స్..!

-- ఈ నెల 18 నుండి జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో "న్యూ మోకాకల్ కాంజు గేట్ వ్యాక్సిన్" వేయడానికి ఏర్పాట్లు.

--వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించిన అదనపు కలెక్టర్ రాజర్షి షా.

సంగారెడ్డి, ఆగస్టు 13 (నేటినిజం ప్రతినిధి) గురువారం అదనపు కలెక్టర్ చాంబర్లో వైద్య ఆరోగ్య శాఖ మరియు అనుబంధ శాఖల తో జిల్లా టాస్కోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల్లో న్యూమోనియా వ్యాధి నిరోధించడానికి కొత్తగా

న్యూ మోకాకల్ కాంజు గేట్ వ్యాక్సిన్ ను అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో ఈ నెల 18 న ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇట్టి విషయమై ఆయా అనుబంధ శాఖల అధికారులు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉచితంగా వేస్తున్న ఇట్టి టీకాను ఆరు వారాల వయసు గల పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు.

జిల్లా వ్యాధినిరోధకటీకాలు అధికారి మాట్లాడుతూ ఆరు వారాల వయసు పిల్లలకు మిగతా టీకాలు తో పాటు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఇట్టి వ్యాక్సిన్ మూడు డోసులు ఇస్తారని, మొదటి డోసు 6 వారాలకు, రెండవ డోసు 14 వారాలకు , తొమ్మిది నెలలకు మూడవ డోసు గా బూస్టర్ డోస్ వేయడం జరుగుతుందన్నారు. ఉచితంగా వేస్తున్న ఇట్టి టీకాను పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రీ దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శశాంక్ దేశ్పాండే, డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'దళిత బంధు' నిధులిస్తే.. రాజీనామా చేస్తా: బీజేపీ ఎమ్మెల్యే

హైదరాబాద్ , ఆగష్టు 13:ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందేందుకే 'దళిత బంధు' పేరిట హుజూరాబాద్ లో వందల కోట్ల రూపాయలు కేసీఆర్ ఖర్చు పెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ఆరోపించారు. తన నియోజకవర్గం సహా రాష్ట్రవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, పేదలు ఉన్నారని.. వారి కోసం ఎందుకు నిధులు ఖర్చు పెట్టడం లేదని ప్రశ్నించారు. తన నియోజకవర్గ ప్రజలకు వందల కోట్ల రూపాయల దళిత బంధు నిధులు వస్తాయంటే తాను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికల ప్రజాక్షేత్రంలో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాజాసింగ్ ప్రకటించారు.

అధికారం కోసం ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కేసీఆర్ సిగ్గు లేకుండా సంతల్లో పశువుల్లా కొంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా.. కేసీఆర్ మాత్రం అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం దృష్టి

అమరావతి, ఆగష్టు 13:ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కోటాలోని 1238 బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు త్వరలోనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన వయో పరిమితి జీవోను జారీ చేసే సూచనలు కన్పిస్తున్నాయి.

ఆ జీవో రాగానే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే గ్రామ సచివాలయాల ద్వారా భారీగా ఉద్యోగ నియామకాలు చేసిన ప్రభుత్వం.. తాజాగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది

ప్రభుత్వం. గత నెలలోనే ఏపీపీఎస్సీ నుంచి ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కోటాలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. కానీ, ఈ విషయంలో చిన్నపాటి సాంకేతిక అడ్డంకిని ఏపీపీఎస్సీ గుర్తించింది. అభ్యర్థులకు వయో పరిమితిని సడలిస్తూ గతంలో ఇచ్చిన జీవో కాలపరిమితి గత మే నెలలో ముగిసిపోవడమే.. దీనికి కారణమని తేల్చింది వయో పరిమితికి సంబంధించిన జీవోను జారీ చేయాలని కోరుతూ ప్రభుత్వాన్ని కోరింది . బహుశా వారం పది రోజుల్లో ఏపీపీఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన జీవోను జారీ చేసే అవకాశం ఉంది.

జిల్లాలో డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యాచరణ చేపట్టాలి...!!

-సంబంధిత అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, ఆగస్ట్ 13(నేటినిజం ప్రతినిధి) గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులకు డెంగ్యూ ,సీజనల్ వ్యాధుల నియంత్రణ హరిత హారంలో నాటిన మొక్కల సంరక్షణ, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో అక్కడక్కడ డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా, సీజనల్ వ్యాధులు, డెంగ్యు వ్యాధి ప్రబలడానికి కారణాలు ,నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు.

పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని సూచించారు. గురువారం నుండి సోమవారం వరకు 5 రోజులు అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రత్యేకంగా డ్రైడే గా నిర్వహించి ఉద్ధృతంగా డ్రైవ్ కొనసాగేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ ఐదు రోజులు అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ లు , డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ క్షేత్రస్థాయిలో పర్యటించి ఇల్లిల్లు తిరుగుతూ అవగాహన కల్పించాలన్నారు. ఎవరికి సెలవులు ఉండవని స్పష్టం చేశారు.

గ్రామస్థాయి లో సర్పంచ్, వార్డు మెంబర్లు ,ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, గ్రామ పంచాయతీ సిబ్బంది ,పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీలలో మున్సిపల్ చైర్మన్ ,కమిషనర్ ,వార్డ్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి నిల్వ నీటిని ఖాళీ చేయించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని సూచించారు.

గ్రామాలు పట్టణాలలో లార్వా నిర్మూలన, దోమల నివారణకు అవసరమైన రసాయనాల స్ప్రే, ఆయిల్ బాల్స్ వేయడం లాంటి చర్యలు చేపట్టాలని కోరారు. కొబ్బరి బోండాలు ,టైర్ల షాప్ ల యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు జారీ చేయాలన్నారు. వినకపోతే జరిమానా విధించడంతో పాటు చర్యలు తీసుకోవాలన్నారు.

మురుగు కాలువలలో నీరు సాఫీగా పారేలా చూడాలని ,నీటి నిల్వ ఉండే గుంతలు పూడ్చాలని తెలిపారు.త్రాగు నీటి ట్యాంక్ లను ప్రతినెల 1,11,21 తేదీలలో శుభ్రం చేయించడంతో పాటు తగు మోతాదులో క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలని, గ్రామంలోని అన్ని ఇన్స్టిట్యూషన్ లలో పరిసరాలను శుభ్రం చేయించాలన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత త్రవ్వుకునెలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. మహిళా సంఘాల మహిళలతో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని

డి ఆర్ డి ఓ కు సూచించారు.

తడి పొడి చెత్త సేకరించడం , సెగ్రిగేషన్ షెడ్ కు తరలించడం, కంపోస్టు ఎరువు తయారుచేయడం, తయారైన ఎరువును హరితహారం మొక్కలకు వేయడం నిరంతర ప్రక్రియ గా కొనసాగాలని తెలిపారు. హరిత హారంలో నాటిన మొక్కలు బ్రతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలకు నీటిని పెట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం వాటర్ డే గా ప్రకటించుకుందామని కలెక్టర్ పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ లో బహుళ వరసల మొక్కలు పెట్టాలని, గ్రీన్ విలేజ్ గా గుర్తింపు పొందేలా మొక్కలు నాటాలని, గ్రీన్ బడ్జెట్ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలను అద్భుతంగా మోడల్ గా చేయాలని కోరారు. పర్యావరణ సమతుల్యానికి అందరూ దృష్టి సారించాలన్నారు.

కోవి డ్ పట్ల ఇంకా అప్రమత్తంగానే ఉండాలన్నారు. అన్ని జాగ్రత్తలను పాతించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జడ్పీ సీఈఓ ఎల్లయ్య , డిఎం అండ్ హెచ్ఓ గాయత్రి దేవి, డి పి ఓ, డి ఆర్ డి ఓ, మెడికల్ ఆఫీసర్లు ,ప్రోగ్రామ్ ఆఫీసర్ లు, డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు..!

– ఆయా శాఖల అధికారులకు ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 13 (నేటినిజం ప్రతినిధి) గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరం లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై ప్రభుత్వం నుండి మార్గదర్శకాలు రావలసి ఉన్నాయని, గతంలో మాదిరిగానే ఏర్పాట్లపై అందరు అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు.

కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించనున్నామన్నారు. ఆ మేరకు డయాస్, బ్యారికేడింగ్ ఏర్పాట్లూ, అతిథికి పొలిసు గౌరవ వందనంతో పాటు వేడుకలలో పొలిసు బందోబస్త్ ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణమంతా శుభ్రంగా ఉండేలా చూడాలని, రోడ్ల వెంట ముళ్ల పొదలను తొలగించాలని, మైదానంలో వాటరింగ్ చేయాలని మునిసిపల్ కమిషనర్కు సూచించారు. డయాస్ ను అందంగా అలంకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్య అతిథికి జిల్లాలో జరుగుచున్న అభివృద్ధి పనులపై ప్రసంగం రూపొందించవలసినదిగా డిపిఆర్ ఓ కు సూచించారు.

అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన పనులను పూర్తి చేసేలా సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. స్టాల్స్ ఏర్పాటు చేయడానికి ఆయా సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈటలకు షాక్.. 'గెల్లు'కే మా ఓటన్న ముదిరాజ్‌లు

హైదరాబాద్ , ఆగష్టు 13:హుజూరాబాద్ మండల పరిధిలోపి పెద్ద పాపయ్యపల్లెకు చెందిన ముదిరాజ్ కులస్తులు టీఆర్ఎస్ పార్టీకి జైకొట్టారు. టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కే తమ ఓటు అని తీర్మానించారు. ఈ మేరకు మంత్రి గంగుల కమలాకర్‌కు ముదిరాజ్‌లు తమ మద్దతు లేఖ అందజేసి.. సుమారు 100 మంది టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి గంగుల గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ.. హుజూరాబాద్‌లో జరగబోయే ఉప ఎన్నికల్లో గెల్లు శ్రీనివాస్ గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మత్స్యకారులు చాలా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. చేపపిల్లల పంపకంతో పాటు, వలలు, ఆధునిక మరబోట్లు ఇతర సామాగ్రిని అందించి మత్స్యకారులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ వెంటే ఉంటామని వారు తేల్చిచెప్పారు.

ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గట్టు పద్దయ్య, సభ్యులు భిక్షపతి, కొమురయ్య, చిన్న రాజయ్య, రామయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో స్కూళ్లు రీ-ఓపెన్.. ప్రభుత్వం నిర్ణయమేంటి?

హైదరాబాద్ , ఆగష్టు 13:తెలంగాణలో విద్యాసంస్థలు తెరిచేందుకు కసరత్తు జరుగుతోంది. సెప్టెంబరు 1 నుంచి పునః ప్రారంభించేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తోంది. దీనిపై సీఎం కేసీఆర్ తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. తొలుత 8 నుంచి ఆపై తరగతులకు ప్రత్యక్ష బోధన మొదలుపెట్టాలని యోచిస్తున్నారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు.. సెప్టెంబరు నెలాఖరులో మొదటి సంవత్సరం పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నారు.

కరోనా ప్రభావంతో గత మార్చిలో విద్యా సంస్థలు మూత పడ్డాయి. మధ్యలో తొమ్మిది ఆపై తరగతులు పాక్షికంగా ప్రారంభించగా.. సెకండ్ వేవ్ తీవ్రత పెరగడంతో ప్రభుత్వం లాక్ డౌన్ విధించింది. దీంతో ఆన్?లైన్ బోధనకే పరిమితం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో వైరస్ ఉధృతి తగ్గింది. కరోనా థర్డ్ వేవ్ ముప్పు ఉందని.. ఆగస్ట్ లోనే మూడో దశ ప్రారంభం కానుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కరోనా కేసులు తక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయి. ప్రతిరోజు 500 నుంచి 600 లోపే కేసులు నమోదు అవుతున్నాయి. ఈ క్రమంలో పాఠశాలలు పున:ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గత నెల 1 నుంచే అన్ని తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం భావించినప్పటికీ.. హైకోర్టు ఆదేశాలతో వెనక్కి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని పలు రాష్ట్రాలు ఈ నెలలోనే విద్యా సంస్థలు తెరుస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ కూడా విద్యా సంస్థలు పున: ప్రారంభానికి సిద్ధమవుతోంది. సెప్టెంబరు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 8 నుంచి ఆపై తరగతులు ప్రారంభించాలని విద్యా శాఖ ప్రతిపాదించింది. వినాయక చవితి ఉత్సవాలు పూర్తయ్యాక సెప్టెంబరు మూడో వారంలో ప్రారంభించాలని మరో ప్రతిపాదన కూడా ఉంది. ప్రతిపాదనలను ఉన్నతాధికారులు విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సమర్పించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్?తో మంత్రి సబితా చర్చించనున్నారు. సీఎం కేసీఆర్ అంగీకరిస్తే విద్యా సంస్థలు ఎప్పటి నుంచి ప్రారంభించాలనే దానిపై స్పష్టత రానుంది. ప్రభుత్వ నిర్ణయం అనంతరం విద్యా సంస్థలు తెరిచే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాజమాన్యాలు, తల్లిదండ్రుల సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు

తిరుమల ఆగష్టు 13:ఇటీవల టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఒలింపిక్స్ నుంచి దేశానికి తిరిగి వచ్చిన అనంతరం ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులను కలిసిన ఆమె గురువారం తిరుమలకు విచ్చేసింది. ఈ సందర్భంగా పీవీ సింధుకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆమెకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం పీవీ సింధు మీడియాతో మాట్లాడుతూ.. యువ క్రీడాకారుల కోసం త్వరలోనే విశాఖలో అకాడమిని ప్రారంభిస్తానని తెలిపింది. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తే దేశానికి మరిన్ని పతకాలు వస్తాయని, అందుకే వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కోవిడ్ సమయంలో ప్రజలందరూ తప్పకుండా వ్యాక్సిన్ వేసుకోవాలని పీవీ సింధు సూచించింది.

బోధన్ బస్టాండ్‌లో భారీ చోరీ

నిజామాబాద్, ఆగష్టు 13:జిల్లాలోని బోధన్ బస్టాండ్‌లో శుక్రవారం భారీ చోరీ జరిగింది. బంగారం, వెండి, నగదు ఉన్న బ్యాగుతో వ్యాపారి బస్సు ఎక్కాడు. కాగా బ్యాగును సీటులో పెట్టి టికెట్ కోసం డ్రైవర్ వద్దకు వెళ్లగా ముగ్గురు దొంగలు బ్యాగుతో ఊడాయించారు. బాధిత వ్యాపారి బోధన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బ్యాగులో 41 తులాల బంగారం, 7 కిలోల వెండి, రూ.లక్ష ఉన్నట్లుగా తెలిపాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భూ రికార్డుల ప్రక్షాళన విప్లవాత్మకం: మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, ఆగష్టు 13:: సీఎం కేసీఆర్ చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం విప్లవాత్మకమైనదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూరులో కొత్తగా నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరణి వెబ్‌సైట్ ప్రపంచంలోనే గొప్ప ప్రయోగమని చెప్పారు. దీనివల్ల ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ప్రజలకు పాలనను చేరువ చేయడానికి, పారదర్శక పాలనను అందించడానికి సీఎం కేసీఆర్ అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు ప్రాధాన్యత ప్రాతిపదికన ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు మారాలని సూచించిన విద్యుత్ శాఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 13:ప్రాధాన్యత ప్రాతిపదికన ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు మారాలని తమ నిర్వాహక నియంత్రణలో ఉన్న సంస్థలకు సూచించాలని విద్యుత్ మంత్రిత్వ శాఖ అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలకు సూచన చేసింది. సదరు ప్రక్రియలో భాగంగా ఈ విషయమై అవసరమైన అన్ని ఆదేశాలను కూడా జారీ చేయాలని మంత్రిత్వ శాఖలను కేంద్ర విద్యుత్ శాఖ కోరింది. దీనికి కొనసాగింపుగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక క్లారిఫికేషన్‌ను (స్పష్టతను) కూడా జారీ చేసింది. దీని ప్రకారం అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు మరియు కేంద్ర శాఖలు ప్రీ-పెయిడ్ మీటర్ విద్యుత్ నిమిత్తం తగిన ముందస్తు చెల్లింపులు చేయడానికి వీలు కల్పించింది. ముందు చెల్లింపు విద్యుత్ మీటర్ కోసం ముందస్తు చెల్లింపులు, ఎలాంటి బ్యాంక్ హామీకి పట్టుబట్టకుండా చెల్లింపులు చేసేలా తగిన వెసలుబాటును కల్పించింది. అదే సమయంలో సరైన అకౌంటింగ్ ఏర్పాట్లను నిర్ధారించుకోవాలని సూచించింది. అన్ని ప్రభుత్వ రంగ విభాగాలలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరింగ్ అనేది ఆయా డిస్కామ్‌లను ఆర్థిక సుస్థిరత మార్గంలోకి తీసుకురావడంలో ప్రభుత్వ నిబద్ధతను నిర్ధారించడంలో.. సుదీర్ఘ మార్గంగానే కాకుండా ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించేలా చేస్తుంది. రాష్ట్రాలు తమ సొంత శాఖల ద్వారా విద్యుత్ బకాయిల ముందస్తు చెల్లింపుకు మద్దతు ఇచ్చే లాంటి యంత్రాంగాన్ని నిర్వచించేలా ఎమ్యులేషన్ కోసం కూడా ఇది మోడల్‌గా ఉపయోగపడతుంది. దేశంలో వినియోగదారులందరికీ నిరంతరాయంగా, విశ్వసనీయమైన మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది దీనికి గాను ఒక కార్యాచరణ సమర్థవంతమైన మరియు ఆర్థికంగా స్థిరమైన విద్యుత్ రంగం తప్పనిసరి. డిస్కామ్‌లను తరచుగా అత్యంత ముఖ్యమైనవిగా పేర్కొంటారు. కానీ విద్యుత్ రంగ విలువ గొలుసులో బలహీనమైన లంకే, విలువ గొలుసు దిగువన ఉన్న వారి పేలవమైన ఆర్థికపరమైన ఆరోగ్యం.. ఎగువన ఉన్న విభాగాలపై తగిన ప్రతికూల ప్రభావాలన్ని చూపుతుంది. ఆర్థిక నష్టాలకు కారణమయ్యే కార్యాచరణ అసమర్థతలతో పాటు, కేంద్ర ఉ రాష్ట్ర ప్రభుత్వాలతో సహా.. ప్రభుత్వ శాఖల విద్యుత్ బకాయిలు పెరగడం; పట్టణ మరియు గ్రామీణ స్థానిక సంస్థలు; విద్యుత్ వినియోగానికి ఆలస్యం మరియు సరిపడా చెల్లింపుల చేయని కారణంగా ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్‌లు కూడా డిస్కామ్‌ల నగదు ప్రవాహానికి ఇబ్బంది కలిగించేలా కారణమవుతున్నాయి. లోపాలను అధిగమించడానికి డిస్కామ్‌లు ఉపయోగించే ఆయా అదనపు వర్కింగ్ క్యాపిటల్‌పై వడ్డీ భారం వారి ఖర్చులపై ద్రవ్యోల్బణ ఒత్తిడిని మరింతగా సృష్టిస్తుంది.. తద్వారా ఇది వారి సాధ్యతపై మరింత ఒత్తిడిని కలిగిస్తోంది. రాష్ట్రాల నుండి అందిన అంచనాలు మేరకు 2020-21 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ప్రభుత్వ శాఖల మొత్తం బకాయిలు రూ.48,664 కోట్లుగా ఉండొచ్చని సూచిస్తున్నాయి. ఇది వార్షిక విద్యుత్ రంగ టర్నోవర్‌లో ది 9%. ఇది భారీ విలువ. విద్యుత్ పంపిణీ విభాగం (డిస్ట్రిబ్యూషన్ సెక్టార్) యొక్క కార్యాచరణ సామర్థ్యం, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచడానికి, భారత ప్రభుత్వం 'పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం- ఒక సంస్కరణల ఆధారిత- ఫలితాలపై ఆధారపడే-లింక్డ్ స్కీమ్'కు ఆమోదం తెలిపింది. ఈ పథకం ప్రస్తుతం ఉన్న డిస్కామ్‌లను కార్యాచరణ సమర్థవంతంగా మరియు ఆర్థికంగా నిలకడను సాధించేందుకు వీలుగా తోడ్పాటును అందిస్తుంది. ఈ పథకం కింద పాత్ బ్రేకింగ్ జోక్యాలలో ఒకటిగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను వ్యవసాయ వినియోగదారులకు మినహా అన్ని విద్యుత్ వినియోగదారులకు దశల వారీగా ఏర్పాటు చేయాలనే యోచన ఉంది. దీనిలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలతో సహా అన్ని ప్రభుత్వ రంగ విభాగాలలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వబడింది; పట్టణ మరియు గ్రామీణ స్థానిక సంస్థలు; మరియు ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లు ప్రభుత్వ శాఖలు సరిగా బడ్జెట్ మరియు విద్యుత్ సేవలను ఉపయోగించినప్పుడు చెల్లింపులు జరిగేలా చూసేందుకు వీలుపడుతుంది.

2017-18, 2018-19 సంవత్సరాలకు 22 మందికి జాతీయ యువజన అవార్డులను బహుకరించిన కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఆగష్టు 13:కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ 2017-18, 2018-19 సంవత్సరానికి నేషనల్ యూత్ అవార్డులను ఈరోజు విజ్ఞాన్ భవన్‌లో అందజేశారు. 2021 అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటూ, వ్యవసయార ఎంటర్‌ప్రైజ్ ఛాలెంజ్ ఎస్.ఒ.ఎల్.బి.ఇ.డి 2021 కి సంబంధించినపది మంది యువ పారిశ్రామికవేత్త ల బృందాన్ని సత్కరించారు. క్రీడల మంత్రిత్వశాకకు చెందిన కార్యదర్శి, శ్రీమతి ఉషాశర్మ, యుఎన్ రెసిడెంట్ కోర్డినేటర్ డీర్డే బాయ్‌డాండ్, జాయింట్ సెక్రటరీ యువజన వ్యవహారాలుశ్రీ అసిత్ సింగ్ లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ శ్రీ అనురాగ్ ఠాకూర్, "ఈ రోజు అంతర్జాతీయ యువజన దినోత్సవం. ఐక్యరాజ్యసమితి దీనిని ప్రకటించింది. అంతర్జాతీయ యువజన దినోత్సవం అనేది కేలండర్‌లో కేవలం మరో రోజు లాంటిది కాదుభారతదేశ యువత, భారత దేశ భవిష్యత్తు, ముఖ్యంగా భారతదేశ వర్తమానం కూడా. వీరు ప్రస్తుత కృత్రిమ మేధ ఆవిష్కరణల ఆత్మనిర్భర ఆవిష్కరణల కాలంలో వినూత్న ఆలోచనలు ఆవిష్కరణలకు చోదకశక్తి వంటి వారు అని ఆయన అన్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ యువజనదినోత్సవ థీమ్ ఆహార వ్యవస్థల పరివర్తనపై దృష్టిపెడుతోంది. ఈ పరివర్తనకు యువత కీలకం. యువత నేతృత్వంలోని అగ్రిటెక్ ఆవిష్కరణలు ఈ రంగంలో నూతన ధోరణులకు చోదకశక్తిగా ఉంటున్నాయి. ఇలాంటి అంతర్జాతీయ కృషి యువత అర్థవంతమైన భాగస్వామ్యం లేకుండా సాధించడం కుదరదు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, యువత సారథ్యం వహించే స్టార్టప్‌లకు ఫండింగ్, వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్నది. ప్రపంచంలోనే అతి పెద్ద సంఖ్యలో నైపుణ్యాలు కలిగిన వారిగా భారతీయయువతను తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ యువజన అవార్డులను గెలుచుకున్న వారిని అభినందించారు. ఆయా రంగాలో యువత అత్యంత ప్రతిభ కనబరచేందుకు ప్రోత్సహించడానికి ప్రేరణగా ఈ అవార్డులు పనికి వస్తాయని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా శ్రీమతి డీర్డే బాయ్డ్ మాట్లాడుతూ ప్రపంచంతో భాగస్వామ్యం వహించడానికి ఇండియాకు ఎంతో ఉందని అన్నారు. ఇండియాలో ఎంతోమంది నైపుణ్యం కల యువకులు ఉన్నారన్నారు. యువత మార్పును ప్రభావితం చేయగలరని, దేశ ప్రగతికి వినూత్న ఆలోచనలు చేయగలరని అన్నారు. సుస్థిరాభివృద్ధికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువత కీలకపాత్ర పోషించగలదని అన్నారు.

యువజనవ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీమతి ఉషా శర్మ మాట్లాడుతూ మార్పుతీసుకువచ్చేవారుగా భారతీయ యువత బహుముఖపాత్ర పోషిస్తున్నారని అన్నారు. యువ ఎంటర్‌ప్రెన్యుయర్లు, నిస్వార్థ వాలంటీర్లు కమ్యూనిటీ ప్రయోజనాలను కాపాడుతున్నారన్నారు.మొత్తం 22 జాతీయ యువజన అవార్డులను వ్యక్తిగత స్థాయిలో, సంస్థాగత స్థాయిలో అందజేశారు. మొత్తం 14 అవార్డులను ఎన్‌వైఎ 2017-18 కు సంబంధించి అందజేశారు. ఇందులో 10 అవార్డులు వ్యక్తిగత కేటగిరీలో,4 అవార్డులు సంస్థాగత కేటగిరీలో ఉన్నాయి. 2018-19 నేషనల్ యూత్ అవార్డ్స్ (ఎన్ వై ఎ) కింద ఏడు అవార్డులు వ్యక్తిగత కేటగిరీలో, 1 అవార్డు సంస్థాగత కేటగిరీలో అందజేయడం జరిగింది. వ్యక్తిగత అవార్డు కింద ఒక పతకం, సర్టిఫికేట్,నగదు బహుమతి గా లక్ష రూపాయలు , సంస్థాగత కేటగిరీలో రూ 3,00,000 నగదు బహుమతి అందజేస్తారు.

దళిత దండోరాకు ఆ నేతలు వస్తారా?

హైదరాబాద్ , ఆగష్టు 13:తెలంగాణ కాంగ్రెస్ దళిత, గిరిజన దండోరా రెండో సభకు సిద్ధమవుతోంది. ఇంద్రవెల్లిలో జరిగిన సభ విజయవంతం కావడంతో రెండో సభను సైతం అదే స్థాయిలో విజయం చేసే దిశగా కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో దళిత, గిరిజన దండోరా కార్యక్రమం నిర్వహించనున్నారు. అయితే, ఈ సభకు పార్టీ కీలక నేతలు హజరు అవుతారా? లేదా? అన్నది ఉత్కంఠగా మారింది.

ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ తల పెట్టిన దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు కీలక నేతలు గైర్హాజరయ్యారు. పార్టీలో కీలక వ్యవహరించిన నాయకులు ఇంద్రవెల్లి సభకు దూరంగా ఉండడంతో.. కాంగ్రెస్‌లో ఆదిపత్య పోరు ఇంకా తగ్గలేదనే టాక్ వినిపించింది. సదరు నాయకులు కావాలనే సభకు రాలేదా? లేకా ఆ నాయకులను కావాలనే పక్కన పెట్టారా? అన్నది హాట్ టాపిక్ అయ్యింది. నల్గొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి బ్రదర్స్ ఎక్కడా కనిపించ లేదు. మాజీ పీసీసీ చీఫ్ అయిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఆయన సోదరుడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సీనియర్ నేతలు మర్రి శశిధర్ రెడ్డి, వీహెచ్, రాష్ట్ర పార్టీ ఇంచార్జి మాణిక్యం ఠాగూర్ సైతం ఇంద్రవెల్లి సభకు గైర్హాజరు అయ్యారు. దీంతో తాజాగా ఇబ్రహీంపట్నంలో తలపెట్టిన సభకు వారు వస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతోంది.

పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్టీ కార్యక్రమాలలో అంత చురుగ్గా పాల్గొనటం లేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంద్రవెల్లి సభకు దుమ్మా కొట్టడం వెనుక పార్టీలో ఆయనకు ప్రాధాన్యత తగ్గడమే అని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉత్తమ్ బంధువైన కౌశిక్ రెడ్డి టీఆర్ఎస్ లో చేరడంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గించారనే వాదానలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ లో కోవర్టలకు స్థానం లేదంటూ ఇప్పటికే రేవంత్ వార్నింగ్ ఇచ్చారు. టీఆర్ఎస్ కు అనుకూలంగా ఉండే నేతలను రేవంత్ దూరం పెడుతున్నారనే తెలుస్తోంది. అందుకే రాష్ట్ర పార్టీ తీసుకునే కీలక నిర్ణయాలు సైతం ఉత్తమ్ కు చెప్పడం లేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యనేతల భేటీకి సంబంధించిన కనీస సమాచారం కూడా ఆయనకు ఇవ్వడం లేదని చర్చ జరుగుతోంది. ఇంద్రవెల్లి సభకు సంబంధించి సమాచారం లేకపోవడం వల్లనే ఆయన రాలేకపోయారని ఉత్తమ్ వర్గం చెబుతోంది.

ఇంద్రవెల్లి సభకు సంబంధించి కనీసం ఆహ్వానం అందకపోవడంతో కోమటిరెడ్డి సోదరులు కూడా అసంతృప్తిగా ఉన్నారట. సభ ఏర్పాటుకు సంబంధించి వారిని ఎవరు సంప్రదించలేదని బాహాటంగానే అంటున్నారు. అయితే, కారణాలు ఏవి అయిన, పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి జరిగిన సభకి ముఖ్య నేతలు రాకపోవడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు నిరాశకు గురైయ్యారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం సభకు అందరు నాయకులను స్వయంగా ఆహ్వానించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కోమరెడ్డి సహా తొలి సభకు హాజరు కానీ నాయకులను స్వయంగా కలిసి సభకు రావాల్సిందిగా ఆహ్వానించనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

మరోవైపు ఇబ్రహీంపట్నం సభ నిర్వహణకు ముందు అనుకున్న స్థలాన్ని మార్చారు. పోలీసుల అనుమతి ఇవ్వకపోవడంతో స్థలాన్ని మారుస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు కాకుండా ఉండేందుకు ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఈ దండోరా సభ నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. మొత్తం మీద ఈ సభకు ఎంత మంది సీనియర్లు వస్తారు? అన్నది చూడాలి.

బండి సంజయ్ పాదయాత్ర పేరు ఖరారు

హైదరాబాద్ , ఆగష్టు 13:తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఈ నెల 24 నుంచి పాదయాత్ర చేయనున్నారు. ఈ పాదయాత్రకు 'ప్రజా సంగ్రామ యాత్ర'గా ఖరారు చేశారు. హైదరాబాద్ నగరంలోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద అధికారికంగా బీజేపీ నేతలు ప్రకటించారు. భాగ్యలక్ష్మి దేవాలయంలో బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు రాజా సింగ్, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, పార్టీ నేతలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల తర్వాత ప్రజా సంగ్రామ యాత్ర పేరును ప్రకటించారు. పాతబస్తీ నుండి హుజూరాబాద్ వరకు బండి సంజయ్ యాత్ర కొనసాగిస్తారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, నియంత్రుత్వ, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా బండి సంజయ్ ఈనెల 24నుండి చేపట్టబోయే 'ప్రజా సంగ్రామ యాత్ర'కు రాష్ట్రం నలుమూలల నుండి ప్రతి ఒక్క కార్యకర్తలు హాజరవుతారని చెప్పారు. పాతబస్తీని కేసీఆర్ ఎంఐఎం నేతలకు తాకట్టు పెట్టారని రాజాసింగ్ ఆరోపించారు. అధికారం కోసం ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కేసీఆర్ సిగ్గు లేకుండా సంతల్లో పశువుల్లా కొంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా.. కేసీఆర్ మాత్రం అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కు దమ్ముంటే కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హుజురాబాద్ లో ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో బండి పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నారు. వారం రోజుల పాటు ఆయన హుజురాబాద్ లో పర్యటిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్ర చేయాలని బండి సంజయ్ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్ట్ 9 నుంచే పాదయాత్ర చేయాలని తొలుత షెడ్యూల్ ప్రకటించారు. అయితే, పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో పాదయాత్రను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేశారు. విడతల వారీగా ఈ పాదయాత్ర నిర్వహించనున్నారు. మొదటి విడతగా ఈ నెల 24వ తేదీ నుండి యాత్ర ప్రారంభం కానుంది. హుజురాబాద్ ఉప ఎన్నికలను పురస్కరించుకొని తొలివిడత పాదయాత్ర ఈ రూట్ గుండా సాగనుంది. మొదటి విడత యాత్ర తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా మరో విడత యాత్రను బండి సంజయ్ నిర్వహించనున్నారు.

యాదాద్రి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన సీఎంవో కార్యదర్శి

యాదాద్రి భువనగిరి, ఆగష్టు 13: యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న తుది మెరుగుల పనులను సీఎంఓ కార్యదర్శి భూపాల్ రెడ్డి పరిశీలించారు. మొదటగా బాలాలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా జరుగుతున్న తుది మెరుగులను పరిశీలించారు. క్యూ లైన్లు, మాడ వీధులు, లిఫ్టు, రథశాల పనులను పరిశీలించి, ప్రధానాలయం తూర్పు రాజగోపురానికి గల దర్వాజలకు ఇత్తడి తొడుగుల పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు.

గర్భాలయంలోని లైటింగ్ పనులు పరిశీలించి భూపాల్ రెడ్డి పలు సూచనలు చేశారు. శివాలయం, మెట్ల నిర్మాణ పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొండ కింద గండి చెరువు వద్దగల పుష్కరిణి, కల్యాణ కట్ట, ప్రెసిడెన్షియల్ సూట్ల పనులను పరిశీలించి పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట కలెక్టర్ పమేలా సత్పతి, ఆలయ ఈవో గీత, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఈఎన్సీ రవీందర్ రావు, ఎస్ఈ వసంత నాయక్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద సాయి, ఈఈ వెంకటేశ్వర్ రెడ్డి, రామారావు తదితరులు ఉన్నారు.

కరోనా టీకా కేంద్రంలో కొట్టుకున్న జనం

పాట్నా, ఆగష్టు 13:: ఒక కరోనా టీకా కేంద్రం వద్ద జనం కొట్టుకున్నారు. దీంతో అక్కడ హింస చెలరేగింది. బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఇటావాహ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కరోనా టీకా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వ్యాక్సినేషన్ కోసం గ్రామ ప్రజలు శుక్రవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా తమ వంతు కోసం వేచి ఉండలేక కొందరు గ్రామస్తులు అసహనానికి గురయ్యారు. దీంతో మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో కొందరు కొట్టుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

మరోవైపు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలో కూడా శుక్రవారం ఉదయం ఇలాంటి ఘటనే జరిగింది. కరోనా టీకా తొలుత తీసుకునే క్రమంలో రెండు గ్రూపులు ఒకరిపై ఒకరు చెంపదెబ్బలు కొట్టుకున్నారు.

వరుసగా రెండో రోజూ పెరిగిన బంగారం ధర

న్యూఢిల్లీ, ఆగష్టు 13: ఢిల్లీలో బంగారం ధర (ఉనీశ్రీత జూతీతిఇవ) వరుసగా రెండో రోజూ పెరిగింది. ఇవాళ ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.222 పెరిగి రూ.45,586కు చేరింది. క్రితం ట్రేడ్లో తులం బంగారం ధర రూ.45,364 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా విలువైన లోహాల ధర పెరుగడం, రూపాయి మారకం విలువ కొంత బలహీనపడటం దేశీయంగా బంగారం ధరలు స్వల్పంగా పెరుగడానికి కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నిపుణులు తెలిపారు.

అదేవిధంగా వెండి ధరలు కూడా ఇవాళ స్వల్పంగా పెరిగాయి. ఢిల్లీలో కిలో వెండి రూ.100 పెరిగి రూ.61,045 పలికింది. క్రితం ట్రేడ్‌లో కిలో వెండి ధర రూ.60,945 వద్ద ముగిసింది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 1,757 అమెరికన్ డాలర్‌లు పలికింది. ఔన్స్ వెండి ధర 23.30 అమెరికన్ డాలర్‌లు పలికింది. ఇదిలావుంటే ఇవాళ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ కూడా డాలర్‌తో పోల్చితే మూడు పైసలు తగ్గి రూ.74.28కి చేరింది.

భవిష్యత్తులో అవసరం అయ్యే మానవ వనరులను సిద్ధం చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది .. కేంద్ర విద్యా మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 13:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని కేంద్ర విద్య మరియు నైపుణ్య అభివృద్ధి మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. 'జీవనోపాధి కోసం ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటు' అనే అంశంపై సీఐఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో వర్చువల్ విధానంలో మంత్రి ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తులో మరింత బలపడుతుందని అన్నారు. ఉత్పాదకత పెరిగి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అవసరమని మంత్రి పేర్కొన్నారు.

21 శతాబ్దం నైపుణ్యాలతో యువతను సన్నద్ధం చేయడానికి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని శ్రీ ప్రధాన్ అన్నారు. 2020 నూతన విద్యా విధానంలో పేర్కొన్న విధంగా విద్య, నైపుణ్యాభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నదని ఆయన వివరించారు. బలమైన విద్యా వ్యవస్థను రూపొందించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడానికి నూతన విద్యా విధానం దోహద పడుతుందని శ్రీ ప్రధాన్ పేర్కొన్నారు.

విద్యా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలపై కోవిడ్ చూపించిన ప్రభావాన్ని ప్రభుత్వం డిజిటల్ విద్యా విధానానికి ప్రాధాన్యత ఇచ్చి అధిగమించిందని శ్రీ ప్రధాన్ అన్నారు.సమీప భవిష్యత్తులో ప్రతి గ్రామాన్ని హై-స్పీడ్ ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తామని చెప్పిన మంత్రి ఈ భారీ-స్థాయి డిజిటలైజేషన్ ప్రయత్నాలు నూతన విద్య, నైపుణ్యం మరియు వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలకు రూపకల్పన చేస్తాయని అన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని శ్రీ ప్రధాన్ అన్నారు. వవ సమాజ రూపురేఖలను సాంకేతికత తీర్చిదిద్దుతుందని ఆయన వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలకు పదును పెట్టి నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన అన్నారు.

"ఆజాది కా అమృత్ మహోత్సవ్ " జరుపుకుంటున్న సమయంలో భవిష్యత్తు అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను సాధించి ఆత్మ నిర్భర్ భారత్ సాధనకు కృషి చేయాలని శ్రీ ప్రధాన్ సూచించారు. ఈ లక్ష్య సాధనకు భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించి ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని అన్నారు. ఈ లక్ష్య సాధనకు పరిశ్రమలు సహకరించాలని మంత్రి కోరారు.

డిసిఎం శ్రీరామ్ లిమిటెడ్ ఛైర్మన్ మరియు సీనియర్ ఎండి శ్రీ అజయ్ శ్రీరామ్, సిఐఐ డైరెక్టర్ జనరల్ శ్రీ చంద్రజిత్ బెనర్జీ, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ డాక్టర్ గాయత్రి వాసుదేవన్ ఇతర పరిశ్రమ నిపుణులు సదస్సుకు హాజరయ్యారు.

కాలనీల్లో కొనసాగుతున్న కొవిడ్ వ్యాక్సినేషన్ డ్రైవ్

కొండాపూర్, ఆగష్టు 13: కొవిడ్ థర్డ్‌వేవ్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ కొవిడ్ వ్యాక్సిన్ అందించే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా కాలనీలు, బస్తీల్లో ప్రత్యేక డ్రైవ్‌లను ఏర్పాటు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్‌ను అందజేస్తున్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి సర్కిల్ -20 పరిధి కొండాపూర్ డివిజన్‌లోని మార్తాండనగర్, కొత్తగూడల్లో ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్‌లను ఏర్పాటు చేశారు.

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి రోజు 400ల మందికి పైగా వ్యాక్సిన్‌లను అందజేస్తున్నట్లు సర్కిల్ ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక వ్యాక్సిన్ డ్రైవ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ తీసుకోవాల్సిందిగా తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్యే కీలక నిర్ణయం.. సొంత ఖర్చుతో ఆనందయ్య మందు పంపిణీ

అమరావతి, ఆగష్టు 13:కరోనా థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది

తెలంగాణ కవులు వారి రచనలు

తెలంగాణ భారతదేశంలోని 28 రాష్ట్రాలలో ఒకటి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో ప్రధానంగా తెలుగు భాష మాట్లాడే ప్రాంతం, ఆంధ్ర రాష్ట్రంతో కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్రం కొరకు దశాబ్దాలుగా జరిగిన వేర్పాటు ఉద్యమాలు ఫలించి, 2014 జూన్ 2 నాడు కొత్త రాష్ట్రంగా అవతరించింది.

గూడ అంజయ్య:

జీవిత విశేషాలు: లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు 1955లో ఆదిలాబాద్ జిల్లా, దండేపల్లి మండలం, లింగాపురం గ్రామంలో అంజయ్య జన్మించాడు. ఆయనకు ఐదుగురు సహోదరులున్నారు. ఆయన ప్రాథమిక విద్యను లింగాపురం గ్రామంలో చదివారు.ఇంటర్మీడియట్ వరకు లక్సెట్టిపేటలో చదివిన ఆయన.. తర్వాత హైదరాబాద్ లో బీ ఫార్మసీ పూర్తి చేశారు. ఫార్మసిస్టుగా కూడా పనిచేశారు.

జనబాహుళ్యం పొందిన కొన్ని పాటలు:

నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు
జర భద్రం కొడుకో కొడుకో కొమరన్న
ఊరు మనదిరా ఈ వాడ మనదిరా
అయ్యోనివా నువ్వు అవ్వోనివా తెలంగాణోనికి తోటి పాలోనివా?
రాజిగా ఓరి రాజిగా
ఇగ ఎగబడుదాంరో ఎములాడ రాజన్న
లచ్చులో లచ్చన్న.. ఈ లుచ్చాగాళ్ళ రాజ్యంలో బిచ్చగాళ్ల బతుకులాయే
అసలేటి వానల్లో ముసలెడ్లు గట్టుకుని
గజ్జలు గజ్జాలు రెండు గజ్జలో రాజన్న
తెలంగాణ గట్టుమీద సందమామయ్యో

నలభై ఏళ్లుగా కవిగా, రచయితగా ఎన్నో కథలు, పాటలు రాసిన అంజయ్య కలకాలం నిలిచిపోయే పాటలు రాశాడు.

పల్లెలో పుట్టి పెరిగారు కాబట్టే. ఆ వాతావరణం అక్కడి పరిస్థితులే ఆయన పాటలకు ప్రాణమయ్యాయి. పేదల కన్నీళ్లే ఆయన కలంలో సిరా అయ్యాయి. వారి గోసను ప్రపంచానికి చాటి చెప్పాయి. అందుకే ప్రజా కవుల్లో గూడ అంజయ్యది ప్రత్యేక స్థానం. ఆయన ఎవరికి అందని సాహితీ శిఖరం.తను కళ్లారా చూసిన కష్టాలకు, వాటిని అనుభవిస్తున్న వారి నోట వచ్చిన మాటల సూర్తీగా పాటలల్లడం తనకు బాల్యంలోనే అబ్బిన విద్య అని అసలేని వానల్ల ముసలెడ్లు కుట్టుకొని.అనే ఆయన తొలిపాట పుట్టుకకు నేపథ్యం అదేనని అంజయ్య ప్రతి సభలోనే చెప్పేవాడు.కేవలం ప్రజా సమస్యలే కాదు.తెలంగాణ పోరాటంలోనూ గూడ అంజయ్య కీలక పాత్ర పోషించారు. తొలి దశ ఉద్యమంలో అనేక ఆందోళనల్లో పాల్గొన్నారు.తెలంగాణ నినాదంతో ముందుకెళ్లడంతో.జైలు జీవితం కూడా గడపాల్సి వచ్చింది. అయినా ప్రజా ఉద్యమ బాటను వీడలేదు. మలిదశ ఉద్యమంలోనూ తనవంతు పాత్ర పోషించారు అంజయ్య. పాటలతో ఉద్యమానికి ప్రాణం పోశారు. రసమయి బాలకిషన్ తో కలిసి ధూంధాం. ప్రారంభించి ఉద్యమానికి కొత్త శక్తినిచ్చారు.. ఆ రోజుల్లో ఊళ్లో వడ్డీ వ్యాపారుల అక్రృత్యాలకు బలైన ఓ పెద్దాయన చెప్పిన మాటలను%శా% పాటగా మార్చి రచనారంగంలో తొలి అడుగేశారు అంజయ్య. ఏదో పాట రాయాలని రాసే వ్యక్తి కాదు గూడ అంజయ్య. పరిస్థితిని, సంఘటనను ముందుగా తాను ఫీల్ అయ్యి రాసే వ్యక్తి. జనం బాధను తన బాధగా భావించే సాహితీవేత్త అంజయ్య. ఆయన పాట సజీవమైనది. వారిపైన జరుగుతున్న దాడులను ప్రశ్నించారు. అంజయ్య పాటలు మనసును హత్తుకోవడమే కాదు.. ఆలోచన రేకెత్తిస్తాయి. అందుకే.. జీవిత సత్యాలు తెలియకుంటే పాటలు రాయలేమంటారు అంజయ్య.అదీలా బాద్, కరీంనగర్ జిల్లాల్లో విప్లవోద్యమ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఈ పెత్తందార్ల పాలనలో పీడిత జనానికి విముక్తి లేదని, జన ఐక్యతతో ప్రజోద్యమాల ద్వారా శ్రామిక రాజ్యం స్థాపించడమే ఏకైక మార్గమని నమ్మి ఉద్యమ బాటలో పయనించాడు.

దాస్యం సేనాధిపతి

దాస్యం సేనాధిపతి (జననం: అక్టోబర్ 5 1955) తెలంగాణకు చెందిన కవి, కథా రచయిత, సాహితివేత్త.

రచనలు:

నానీల సంపుటి చిటికెలు
అక్షరం సాక్షిగా
శబ్దలయజి
సంవీక్ష
దర్శనం
సుహృల్లేఖజి
నానీల కవుల డైరెక్టరీ
వ్యాస సంపుటి మధురాక్షరి
పరిష్కారం

జీవిత విశేషాలు:

1984లో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 2001లో డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా ఉద్యోగోన్నతి పొంది పెద్దపల్లికి చేరారు. 2013లో జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల నుండి ఉద్యోగ విరమణ చేసారు. అకాడమిక్ సలహాదారుగా, న్యాక్ రీసోర్స్ పర్సన్‌గానూ పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల విభాగానికి అడిషనల్ కంట్రోలర్‌గా పనిచేశారు. 2012లో కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులుగా పనిచేశారు. ప్రస్తుతం సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పలు పత్రికల్లో కాలమిస్టుగానూ పనిచేస్తున్నారు.ఇతని ప్రస్థానం ముందుగా లేఖలతో ప్రారంభమైంది. అనంతరం వ్యాసాల రూపంలోకి మారింది. ఆ తర్వాత ప్రముఖ సమీక్షకులుగా పేరు తెచ్చుకున్నారు.

తదుపరి కవితలు రాయడంతో పాటు కథలకూ శ్రీకారం చుట్టారు. 1984-89 మధ్య వెయ్యికి పైగా లేఖలు రాశారు. అందులో ప్రధాన లేఖలను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. వ్యాసాలు వెయ్యికి పైగా రాశారు. అవి కూడా పుస్తకరూపం దాల్చాయి. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎం.ఎ (తెలుగు) విద్యార్థులకు ఆయన సమీక్షలపై పాఠ్యాంశం ఉంది.

కోవెల సుప్రసన్నాచార్య

ఇతడు యువనామ సంవత్సర ఫాల్గుణ కృష? నవమి కి సరియైన 1936, మార్చి 17 వతేదీన వెంకట నరసింహాచార్యులు, లక్ష్మీనరసమ్మ దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించాడు

ఆధునికంగా భారతీయ సాహిత్యాన్ని భిన్న సంస్కృతి ప్రమాణాలతో విశ్లేషించి దానికి న్యూనత నాపాదించే పద్ధతికి ప్రచారం విశేషంగా ఉన్నది. సంప్రదాయంతో ప్రాప్తించిన అత్యుదాత్తమైన విలువల్ని విస్మరించడం లేదా వ్యంగ్యంగా వక్రీకరించడం వలన సాధించేదేమీ లేదు. దశలక్షణ యుక్తమైన ధర్మాన్ని సంకుచితపరిధిలో నిర్వచింపలేదు. దాన్ని సార్వభౌమం అనే అన్నారు. దేశకాలాదులతో పరిఛిన్నం కాని యమ నియమాలను పతంజలి సార్వభౌమం మహావ్రతమ్ అని పేర్కొన్నాడు.

రచనలు:

భావుకసీమ (సాహిత్య వ్యాససంపుటి)
భావసంధ్య (వ్యాససంపుటి)
దీపవృక్షం
అంతరంగం (పీఠికా సంకలనం)
చందనశాఖి
ఏకశిలా సాహిత్య సౌందర్యము (ప్రసంగ వ్యాసాలు)
కావ్యప్రమితి (వ్యాససంపుటి)

కాశీం

కాశీం తెలంగాణ ప్రాంతానికి చెందిన విప్లవకవి, సహిత్య విమర్శకుడు. వృత్తిరీత్యా విశ్వవిద్యాలయాచార్యులు. విప్లవ రచయితల సంఘంలో క్రియాశీల బాధ్యులు. తెలంగాణ ఉద్యమంలోనూ గణనీయమైన పాత్ర పోషించాడు. ఊరూరా తన ఉపన్యాసాలతో ఉద్యమానికి ఊతనిచ్చాడు. అతను సైద్ధాంతిక రాజకీయ విశ్లేషణలనందించిన మేధావి, వక్త.స్వస్థలం మహబూబ్ నగర్ జిల్లాలోనిఅచ్చంపేట ప్రాంతానికి చెందినవాడు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించాడు.విప్లవం ద్వారా సామాజిక మార్పు సాధ్యమనే దృక్పథం కలవాడు. అతను ప్రజాస్వామిక తెలంగాణను కోరుకున్నాడు. అతను సంపాదకత్వం వహిస్తున్న "నడుస్తున్న తెలంగాణ" మాసపత్రిక తెలంగాణలో బలమైన ప్రతిపక్ష గొంతు.

రచనలు:

పొలమారిన పాలమూరు (దీరె కవిత)
గుత్తికొండ (దీరె కవిత)
నేను తెలంగాణోన్ని మాట్లాడుతున్నా (వ్యాసాలు)
తెలంగాణ ఉద్యమాలు-పాట (వ్యాసాలు)
తెలంగాణ సాహిత్య వ్యాసాలు
కాశీం కవిత్వం
తెలంగాణ సాహిత్య వ్యాసాలు
మానాల (దీరె కవిత)

పొలమారిన పాలమూరు ' రచనను 2003 లో వెలువరించాడు. ఇది పాలమూరు జిల్లాలోని తీవ్రమైన కరువు నేపథ్యంలో వెలువరించిన దీరెకవిత. 2003 లో పాలమూరు జిల్లా కరువు వ్యతిరేక పోరాట కమిటి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని టౌన్ హాలులో నిర్వహించిన 'పాలమూరు గోస ' కవి,గాయక సమ్మేళనంలో ఆవిష్కరించి, వినిపించాడు.

బూర్ల వేంకటేశ్వర్లు

బూర్ల వేంకటేశ్వర్లు వర్తమాన తెలుగు కవి, తెలుగు సహాయ ఆచార్యుడు. మానవతను మేల్కొల్పడమే కవిత్వమంటూ, ప్రజా పక్షం వహిస్తూ సకల ఆధిపత్యాలను ధిక్కరిస్తూ కవిత్వం రాసిన ఆధునిక కవి.

జననం విద్యాభ్యాసం:

ఈయన రాజవీరయ్య, సుభద్ర (భద్రమ్మ) దంపతులకు కరీంనగర్ జిల్లా ఎలిగేడ్ మండలం లాలపల్లిలో 26వ ఆగష్టు, 1973న జన్మించారు. ఎం.కాం. పూర్తి చేసిన వీరు ఆ తర్వాత తెలుగు, సంస్కృతాలలో ఎం.ఏ. చేసారు.

ప్రచురించిన పుస్తకాలు :

వాకిలి (వచన కవిత్వం) 2007
రంగుల విల్లు (నానీలు) 2007
పెద్ద కచ్చురం (వచన కవిత్వం) 2013
బాయి గిర్క మీద ఊరవిశ్క (వచన కవిత్వం) 2015

కోదారి శ్రీను

కోదారి శ్రీను తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉద్యమ గీత రచయిత, గాయకుడు. అస్సోయ్ దూలా హారతి.కాళ్ల గజ్జెల గమ్మతి, ఉండు పైలంగుండు అమ్మ మాయమ్మ ఇల్లు పైలంజూడు తల్లి మాయమ్మ వంటి పాటలను రచించాడు. ప్రస్తుతం తెలంగాణ జాగృతి రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు.

జననం విద్యాభ్యాసం:

శ్రీను 1978, ఆగష్టు 30న చంద్రగిరి అంజయ్య, యాదమ్మ దంపతులకు తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలంలోని గంగాపురంలో జన్మించాడు.10వ తరగతి వరకు గుండాలలో చదివిన శ్రీను, మోత్కూరులో ఇంటర్ విద్యను, హైదరాబాదులో డిగ్రీ చదివాడు.

రచనా ప్రస్థానం

చిన్న వయసునుండే ఉద్యమ పాటలను వింటూ పెరిగిన శ్రీను సాహిత్యంపై ఆసక్తిని పెంచుకున్నాడు. 1998 నుంచి పాటలు రాయడం ప్రారంభించిన శ్రీను, మలిదశ ఉద్యమంలో కీలకమైన పాటలు రాశాడు. 1999లో పైలం సీడీ ఆల్బమ్ లో వచ్చిన బొంబాయి వోతున్న అమ్మ మా యమ్మ పాట గీత రచయితగా నిలబెట్టింది. మొదట్లో తెలంగాణ తల్లి అస్తిత్వాన్ని తెలియజెప్పే కవిత్వం రాసిన శ్రీను, ఆ అస్తిత్వం నుంచి పోరు బాట పట్టిన విధానం కూడా రాశాడు. నల్లగొండ గుండె మీద ఫ్లోరైడ్ బండ గురించి ఇలా తెలంగాణలోని ప్రతి సమస్యను, ప్రతి అంశాన్ని తన పాటల్లో చొప్పించాడు.

తెలంగాణ పాటలోకి దళిత బహుజన మైనారిటీ పారిభాషికా పదాలను, వారి సాంస్కృతిక చిహ్నాలను తెచ్చి పాటను పరిపుష్టం చేశాడు. తన కవిత్వం ద్వారా హిందూ ముస్లింల సమైక్య జీవనాన్ని, ఊరుమ్మడి సాంస్కృతిక అస్తిత్వాన్ని బలంగా ముందుకు తెచ్చాడు.

పాటల జాబితా:

అస్సోయ్ దూలా హారతి...కాళ్ల గజ్జెల గమ్మతి
ఉండు పైలంగుండు అమ్మ మాయమ్మ ఇల్లు పైలంజూడు తల్లి మాయమ్మ
ముద్దుల రాజాలో కొడుకా ఉత్తరమేస్తున్నో బిడ్డ ...సల్లగుండు రాజాలు నువ్ సక్కగుండు రాజాలు

ఎంతో మంది కవులు తమ పాటలతో పద్యాలతో వ్యాసాలతో తెలంగాణ ప్రజలను ఉత్తేజితులను చేసి ఉద్యమం వైపు నడిపించడంలో ప్రధాన పాత్ర పోషించారు.ఇలా ప్రజలను చైతన్య వంతులను చేసిన కొంత మంది కవులను నా వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది. వీరే కాకుండా ఇంకా ఎంతో మంది కవులు తెలంగాణ సాదనలో ప్రధాన పాత్ర పోషించారు.కవులా కలాకారులు ఉద్యమాన్ని తమ భుజాలకు ఎత్తుకొని ప్రజలను చైతన్య వంతులను చేశారు.

-పులిగిల్ల ఉపేందర్
ఓ.యు
సెల్:9573784198

కవులకు పుట్టినిల్లు సూర్యాపేట : మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట, ఆగష్టు 13: : సూర్యాపేట కవులు, రచయితలకు పెట్టింది పేరని మంత్రి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. 'అభ్యుదయ కవులపై తెలంగాణా విమోచనోద్యమ ప్రభావం' అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పాతికేళ్ల కిందట రచయిత పంతంగి వెంకటేశ్వర్లు చేసిన పరిశోధన ఇప్పుడు పుస్తక రూపం దాల్చడం సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటానికి పంతగి తెలంగాణ విమోచన ఉద్యమం అని పేరు పెట్టిండు. సాయుధ పోరాటాన్ని ముందుకు నడిపించిన చరిత్ర సూర్యాపేటకు ఉందన్నారు. మంచి ఆడియన్స్ కల్చర్ ఉన్న జిల్లా సూర్యాపేట అని సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. సూర్యాపేటకు ఉద్యమాలకు విడదీయని బంధం ఉందన్నారు. కవులు సృష్టించిన అక్షరాలు సైతం ఉద్యమాలకు ఊపిరి పోస్తాయని పేర్కొన్నారు. కవితలు, పాటలు, గ్రంథాల రూపంలో కవులు, రచయితలు ఎవరి ప్రతిభ వారిదే..

రాష్ట్ర సాధన సమయంలో వచ్చిన పాటలు ఎప్పటికి మరిచిపోలేమన్నారు. భారతదేశం అభివృద్ధిలో ఇన్ని రకాల మార్పులు వచ్చాయంటే దానికి సాయుధ పోరాటమే ప్రధాన కారణమన్నారు.

కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, పుస్తక రచయిత పంతంగి వెంకటేశ్వర్లు, గుణగంటి వెంకటేశం, భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సదా పేద ప్రజలశ్రేయస్సుకోసం ఆద్య గోలి ఫౌండేషన్

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలము మల్లారం గ్రామానికి చెందిన ప్రజ్వల 22.సంవత్సరాల అమ్మాయి లంగ్స్ డ్యామేజ్ కావడం వల్ల యశోద హాస్పిటల్, సికింద్రాబాద్ నందు అడ్మిట్ అయ్యింది. ఇట్టి అమ్మాయికి సర్జరీ గురించి దాదాపు 8 లక్షల వరకు ఖర్చు అవుతుందని వీరి అన్న కళ్యాణ్ ఫోన్ చేసి ఆర్థిక సహాయం గురించి ఆద్యగోలి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గోలి మోహన్ ని సంప్రదించగామాటఇచ్చిన ప్రకారము గురువారం రాత్రి ఆద్యగోలి ఫౌండేషన్ హైదరాబాద్ కోఆర్డినేటర్స్ యశోద హస్పిటల్ లో వేములవాడ మండలము మల్లారం గ్రామానికి చెందిన ప్రజ్వల చికిత్స కోసం 10వేల రూపాలు ఆర్థిక సహాయముఅందిచడము జరిగినది . ప్రజ్వల తల్లిదండ్రులు ఆద్యగోలి ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు .ఎల్లవేళలాపేద ప్రజకు అండగా ఉంటానని ,ప్రభుత్వ దవాఖాన లో సామాన్యుడికి మెరుగయిన చికిత్స అందాలి అనేది నా లక్యం అని రాబోయే రోజుల్లో మరెన్నో కార్యక్రమాన్ని ఆద్యగోలి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తామని గోలి మోహన్ తెలిపారు.

సహాయ గుణం కలిగి ఉండడం మానవ ధర్మం

-యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొడిశెల రాజశేఖర్
-యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ గులియన్ బరే సిండ్రోమ్ అనే నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా డు ఇతను చాలా పేదవాడు ఇతని ట్రీట్ మెంట్ కొరకు లక్షల్లో రూపాయలు కావాలి అని దాతల సహకారం కోరగా యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారం తో 7,000/- రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందించటం జరిగింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిది అని, పేద వాళ్ళు కష్టాలలో వున్నప్పుడు దాతలు ముందుకు వచ్చి తమకి తోచిన సహాయం అందించాలని కోరారు. సహాయం చిన్నదా పెద్దదా అని కాకుండా ప్రతీ ఒక్కరు సహాయ గుణం కలిగి ఉండాలని కోరారు.ప్రస్తుతం ఇర్ఫాన్ కరీం నగర్ లోని చంద్ర న్యూరో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు ఇతనికి భార్య ఒక కుమారుడు ఉన్నాడు రెక్కాడితే డొక్కాడని పరిస్థితి కావున దాతలు ముందుకు వచ్చి తోచినంత సహాయం చేసి ఒక పేద ప్రాణాన్ని కాపాడాలి అని కోరటం జరిగింది, సహకరించిన దాతల కు ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో యువ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ గడ్డం ప్రశాంత్, ఫౌండేషన్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని ఇన్‌ఆర్బిట్ మాల్‌లో బ్రాండ్‌లపై ఈ ఇండిపెండెన్స్ డే సంధ్భంగా అద్భుతమైన ఆఫర్‌లు

హైదరాబాద్, ఆగష్టు 13: 75 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, ఇనార్బిట్ మాల్, హైదరాబాద్ వినియోగదారుల కోసం గొప్ప ఆఫర్లు మరియు డీల్‌లను ఆస్వాదించడానికి ఎండ్ ఆఫ్ ది సీజన్ సేల్ ని పొడిగించింది. ఇప్పుడు మీరు నెలాఖరు వరకు విస్తృత శ్రేణి బ్రాండ్ల పై తగ్గింపు ధరలపై షాపింగ్ చేయవచ్చు. మీకు ఇష్టమైన కొన్ని బ్రాండ్‌లలో ఫ్లాట్50% తగ్గింపు× ఉంటుంది కాబట్టి, మార్క్ & స్పెన్సర్, సూపర్‌డ్రై, స్లీవ్ మాడెన్, లైఫ్‌స్టైల్, షాపర్స్ స్టాప్, ఆల్డో, చార్లెస్ & కీత్, బాత్ & బాడీ వర్క్స్, లాకోస్ట్, అమెరికన్ ఈగిల్, వెరో మోడా, జాక్ వంటి అద్భుతమైన ఆఫర్లతో షాపింగ్ చేయవచ్చు, ఇనార్బిట్ మాల్ త్రివర్ణ థీమ్‌లో అలంకరించబడింది. ప్రవేశద్వారం వద్ద ఉన్న లాంతర్ల వంటి మాల్‌ని ఆకర్షించే అలంకరణ మరియు మొత్తం మాల్ త్రివర్ణ రంగులో ఆకర్షిస్తుంది. దేశభక్తి వాతావరణాన్ని వ్యాప్తి చేస్తుంది. మాల్ లోపల, కొన్ని ఆసక్తికరమైన ఇన్‌స్టాలేషన్‌లు ఉంచబడ్డాయి, ఇవి ఆకట్టుకునే సెల్ఫీ కోసం సరైన నేపథ్యాన్ని సెట్ చేస్తాయి. స్వాతంత్ర్య దినోత్సవ థీమ్‌లో మొత్తం అలంకరణ చూడదగినది స్వాతంత్ర్య స్ఫూర్తి యొక్క లోతైన అనుభూతిని ఇస్తుంది. ఇనోర్బిట్ మాల్ అపోలో క్లినిక్‌తో కలిసి ఆగస్టు 13 నుండి 16 వరకు ప్రజలకు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటల వరకు వ్యాక్సినేషన్ డ్రైవ్ మరియు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఇటీవల, మాల్ అథారిటీ రిటైల్ భాగస్వాములు మరియు సేవా సిబ్బందికి మాల్‌ను సురక్షితమైన మరియు సంతోషకరమైన ప్రదేశంగా మార్చడానికి టీకాలు వేసినట్లు నిర్ధారించడానికి ఒక టీకా శిబిరాన్ని నిర్వహించింది. దుకాణదారులకు సురక్షితమైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి ప్రతిరోజూ, అన్ని కోవిడ్ భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించబడతాయి. అందువల్ల, ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని స్వేచ్ఛా స్ఫూర్తితో హైదరాబాద్ ఇనార్బిట్ మాల్‌లో జరుపుకోవలని మాల్ నిరహకులు వినియోగదారులను కోరారు.

శ్రీ సంతోషిమాత ఆలయానికి భూమిపూజ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 13:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పా పురం 8వ వార్డు లో శ్రీ సాయి బాబా ఆలయ వెనుక భాగంలో సంతోష మాత దేవాలయానికి నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగుల విష్ణు ప్రసాద్, జోగిని శంకర్, నేరెళ్ల వెంకటేశం, దుర్గం పరశురాం, సరాల దేవయ్య, బొంగోని అంజయ్య తదితరులు పాల్గొన్నారు .ఆలయ నిర్మాణం లో దాతలు ముందుకొచ్చి భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ సభ్యులు నాగుల విష్ణుప్రసాద్ కోరారు.

ఆహ్వానం

డా॥నాగభైరవ అవార్డు
10వ అవార్డు ప్రదానోత్సవ సభ

ఆగస్టు 14, శనివారం సాయంత్రం 5 గంటలకు-జూమ్ వేదిక

ముఖ్య అతిథులు
శ్రీ కె.శివారెడ్డి
కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
శ్రీ నిఖిలేశ్వర్
కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

విశిష్ట అతిథులు
డా॥నాగభైరవ ఆదినారాయణ
నాగభైరవ సాహిత్యపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు
'కళారత్న' బిక్కి కృష్ణ
నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు
డా॥రావి రంగారావు
అమరావతి సాహితీ మిత్రులు వ్యవస్థాపకులు
డా॥జీరం సుందరరావు
ప్రముఖ కవి, రచయిత

ఆత్మీయ అతిథులు
శ్రీ నాగభైరవ వీరబాబు
కీ.శే.డా॥నాగభైరవ కోటేశ్వరరావు గారి తనయులు
శ్రీ సాగర్ శ్రీరామకవచం
సుప్రసిద్ధ నవలా కథా, నవలా రచయిత
శ్రీ విల్సన్‌రావు కొమ్మవరపు, ప్రసిద్ధ కవి
శ్రీ ఏటూరి నాగేంద్రరావు, ప్రసిద్ధ కవి
శ్రీ పి.శ్రీనివాస్‌గౌడ్, ప్రసిద్ధ కవి, రచయిత
శ్రీ బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, కవి

కార్యక్రమ సమర్పణ : శ్రీ చిన్ని నారాయణరావు
డా.నాగభైరవ అవార్డు కమిటీ ప్రధాన కార్యదర్శి

zoom
Meeting ID
883 4916 9277
Passcode
366110

హోస్ట్ : జ్యోతి మువ్వల, కవయిత్రి ■ నిర్వహణ : కలిమిశ్రీ, మల్లెతీగ

ఉత్తమ విమర్శ గ్రంథ పురస్కారం-మొదటి బహుమతి
పుట్టబంగారం - గుడిపాటి రచన - రు.5,000/-ల నగదు
ఉత్తమ విమర్శ గ్రంథ పురస్కారం-ప్రత్యేక బహుమతులు
ఒలుపు - డా॥రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు రచన -రు.1,000/-ల నగదు
అనంతపద్యం - డా॥అమళ్ళదిన్నె వెంకట రమణ ప్రసాద్ రచన -రు.1,000/-ల నగదు
అద్దేపల్లి శ్రీశ్రీ కవితా ప్రస్థానం - కె.వి.రమణారెడ్డి రచన -రు.1,000/-ల నగదు

సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఆగష్టు 13: అన్ని హంగులతో సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనాన్ని తీర్చిదిద్దాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నూతన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన నిర్మాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐడీఓసీ భవన నిర్మాణంలో భాగంగా ఉద్యాన పనులను, మొక్కలు నాటే కార్యక్రమాన్ని, లాన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ఆర్చి పనులు వేగవంతం చేయాలని, నూతన కలెక్టర్ కార్యాలయం పక్కనే బస్ బే నిర్మించాలన్నారు. ఇటు మహబూబ్‌నగర్ నుండి వచ్చే వారికి అటు భూత్పూర్ నుండి వచ్చే వారికి సౌకర్యంగా ఉండేలా, అదేవిధంగా ఆటోలు కూడా నిలిపేందుకు ఏర్పాటు చేయాలని చెప్పారు.

నూతన కలెక్టర్ కార్యాలయనికి ప్రహరీ నిర్మించాలని, బస్ షెల్టర్, పోలీస్ ఔట్ పోస్ట్, బ్యాంకు, ఏటీఎం తదితర వాటన్నింటిని ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా బస్టాప్ వద్ద ఆటోలు నిలుపుకునేందుకు అవకాశం ఉండాలన్నారు. నూతన కలెక్టర్ కార్యాలయ భవనానికి మిషన్ భగీరథ కనెక్షన్, హెలిప్యాడ్ నిర్మాణం పనులను తనిఖీ చేశారు. వీటితో పాటు కార్యాలయం లోపల సమావేశ మందిరంలో ఫాల్ సీలింగ్ పనులను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట రావు, ఈఈ స్వామి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.